సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 6 । మార్చి । 2025



బుద్ధవనాన్ని సందర్శించాలి

జీవితం ప్రశాంతంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ బుద్ధవనాన్ని సందర్శించాలని ఆర్‌కే మిశ్రా పేర్కొన్నారు. - 8లో



ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

బీబీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం పనులు పూర్తై నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. - 9లో





బస్సు సౌకర్యం లేకపోవడంతో జనంపల్లి నుంచి డీసీఎంలో రామన్నపేటకు పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు



మోత్కూరులోని పరీక్ష కేంద్రానికి తండ్రి సాయంతో వస్తున్న విద్యార్థి



మోత్కూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు

తొలిరోజు 6,289 మంది హాజరు

- ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

భువనగిరి : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతమైన వాతావరణలో ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 6,613 మంది విద్యార్థులకు గాను 6,289 మంది హాజరయ్యారు. 324 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు. కాగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. నిర్దేశిత సమయానికి అరగంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈసారి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతిచ్చారు. దీంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఊరట కలిగింది. పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి మాధవిలత

భువనగిరి : మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉంటే అవే వారిని కాపాడుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, జడ్జి మాధవిలత పేర్కొన్నారు. బుధవారం భువనగిరిలోని మాస్ నర్సింగ్ స్కూల్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్ట పరమైన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు అన్ని రంగాల్లో మహిళలు రాణించి సాధికారత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్కూల్ డైరెక్టర్ మాధవరెడ్డి, అధ్యాపకులు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు రివార్డు



ఆలేరు హెడ్‌కానిస్టేబుల్ యాదగిరికి రివార్డు అందజేస్తున్న సీపీ సుధీర్‌బాబు

సాక్షి, యాదాద్రి : ఆలిండియా పోలీస్‌డ్యూటీ మీట్–2025లో గోల్డ్ మెడల్ సాధించిన ఆలేరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని బుధవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు రివార్డుతో సత్కరించారు. జార్ఖండ్‌లోని రాంచీలో ఫిబ్రవరి 10నుంచి 16వ తేదీ వరకు జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్విస్టిగేషన్ విభాగంలో యాదగిరి ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. కమిషనరేట్‌కు ఎక్కువ మెడల్స్ వచ్చేవిధంగా ప్రతిభావంతులకు శిక్షణ ఇవ్వాలని యాదగిరికి సీపీ సూచించారు.

ప్రజాచైతన్య యాత్రలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

రామన్నపేట: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రామన్నపేట మండలంలో ఈ నెల 23నుంచి 28వ తేదీ వరకు ప్రజాచైతన్య యాత్ర చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. రామన్నపేటలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నపేట మండలంలోని 24 గ్రామాల్లో ఆరు రోజు పాటు135 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి సమస్యలపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. రామన్నపేట శాసనసభ నియోజకవర్గాన్ని పునరుద్ధరించాలని, ఆస్పత్రిని వంద పడకలకు పెంచాలని, అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేయాలని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వలను ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైల్ల అశయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్లూరి అంజయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హనీట్రాప్‌తో విలవిల!

న్యూడ్ కాల్స్‌తో సైబర్‌నేరగాళ్ల మోసం

- రూ.లక్షల్లో డిమాండ్
- పరువుపోతుందని అడిగినంత సమర్పించుకుంటున్న బాధితులు
- కొందరు పోలీసులకు ఫిర్యాదు
- వెలుగురాని కేసులు అనేకం
- తాజాగా నకిరేకల్ ఎమ్మెల్యేకు న్యూడ్ కాల్‌తో కలకలం



ఆలేరుకు చెందిన ఓ యువకునికి గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. కాల్ లిఫ్టు చేయడంతో యువతి హిందీలో మాట్లాడుతూ న్యూడ్‌గా డ్యాన్స్ చేస్తూ కనిపించింది. కొద్దిసేపటి తర్వాత ఫోన్ కట్ అయ్యింది. వెంటనే మరో కాల్ వచ్చింది. నీవు న్యూడ్‌కాల్ చూశావని ఆ వీడియో నాదగ్గర ఉంది, వెంటనే డబ్బులు ఇవ్వకపోతే వీడియో నీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పంపిస్తానని బెదిరించింది. దీంతో యువకుడు భయాందోళన చెంది పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు యువతినుంచి వచ్చిన నంబర్‌ను బ్లాక్ చేశారు.

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను న్యూడ్ కాల్‌తో సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో అప్రమత్తమైన ఎమ్మెల్యే.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు సైబర్ మోసగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేసి విచారణ ప్రారంభించారు.

సాక్షి, యాదాద్రి : ఇటీవల జిల్లాలోని ఓ మాజీ ప్రజాప్రతినిధి మొబైల్‌కు హాయ్ అని మెసేజ్ వచ్చింది.. అది సైబర్ నేరగాళ్ల కాల్ అని తెలియక సదరు వ్యక్తి వెంటనే రిప్లై ఇచ్చాడు. అదే నంబర్‌నుంచి ఓ అందమైన యువతి వీడియో కాల్.. అందులో నగ్నంగా కనిపిస్తూ మాటల్లోకి దింపింది. యువతి మాయమాటలు నమ్మి ప్రజాప్రతినిధి కూడా న్యూడ్‌లా కనిపించేశాడు. ఇంకేముంది ఆ దృశ్యాన్ని యువతి స్క్రీన్‌షాట్ తీసి అతనికి సెల్‌ఫోన్‌కు పంపించి డబ్బులు పంపాలంటూ డిమాండ్ చేసింది. లేకపోతే వీడియోనూ వైరల్ చేస్తానని బెదిరించింది. పరువుపోతుందన్న భయంతో యువతి అడిగినంత డబ్బును మాజీ ప్రజాప్రతినిధి సమర్పించుకున్నాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.. హనీట్రాప్ ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. ఎంతోమందిని సైబర్‌కేటుగాళ్లు నిలువెల్లా దోచుకుంటున్నారు.

రోజుకో రకంగా మోసం

మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు వెనకాడడం లేదు. రోజుకో రకమైన మోసానికి తెర లేపుతున్నారు. ఫేక్ కాల్స్ చేస్తూ లేదా వీడియో కాల్స్‌చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. యువత, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. ఇలా అనిన వర్గాల వ్యక్తులు మోసపోయిన వారిలో ఉంటున్నారు.సెల్‌ఫోన్ వాట్సాప్‌ను సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలుచుకుంటున్నారు. అందమైన యువతుల డీపీ ఫొటో లున్న నంబర్ నుంచి హాయ్ అని మెసేజ్ పంపుతున్నారు. కొందరు స్పందించి రిప్లై ఇస్తున్నారు. చాటింగ్ చేస్తున్న క్రమంలో న్యూడ్ కాల్స్ వస్తున్నాయి. న్యూడకాల్స్ చూస్తున్నారే తప్ప.. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నామన్న విషయం గ్రహించడం లేదు. సైబర్ నేరగాళ్లు న్యూడ్ కాల్స్‌ను రికార్డు చేసి బెదిరిస్తున్నారు. మరికొందరు ఫేస్‌బుక్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడుతారు. అందమైన యువతి ఫొటోతో వచ్చిన రిక్వెస్ట్‌ను ఓకే చెబుతున్నారు. దీంతో సదరు వ్యక్తికి సంబంధించిన ఫ్రెండ్స్, బంధువులు, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ల వారికి తెలిసిపోతున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల నుంచి నంబర్లు సేకరించి వారి న్యూడ్ కాల్ వీడియోను పంపిస్తామని, యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తానని, బంధువులకు పంపిస్తానని బెదిరింపులకు దిగుతున్నారు. సదరు వ్యక్తికి చెందిన ఒకరిద్దరికి న్యూడ్‌కాల్ క్లిప్‌లు పంపించి బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో విషయం అందరికి తెలిస్తే పరువుపోతుందన్న భయంతో చాలామంది సైబర్‌నేరగాళ్లకు డబ్బులు సమర్పించుకుని లబోదిబోమంటున్నారు. పరువు పోతుందన్న భయంతో పోలీస్‌లను ఆశ్రయించడంలేదు. కాగా ఎక్కువ కాల్స్ మధ్యప్రదేశ్ పేరుతో వస్తున్నా. రాజస్థాన్‌కు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ హనుమంతరావు



క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ కాళ్లపై తాము నిలబడే ప్రయత్నం చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు తలచుకుంటే ఏదైనా అవలీలగా సాధించగలరని పేర్కొన్నారు. క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక ధృడత్వం చేకూరుతుందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ మహిళలు ఉద్యోగులు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తుండాలని, దీనివల్ల మానసిక ఒత్తిడి తొలగిపోయి విధులపై ఏకాగ్రత ఉంటుందన్నారు. ఈనెల 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు క్రీడా పోటీలు ఉంటాయని జిల్లా యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి ధనంజనేయులు తెలిపారు. టెన్నికాయిట్, షటిల్, చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్, లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాక్, రన్నింగ్, మ్యూజికల్ బాల్, గ్లాస్ పిరమిడ్ , సింగింగ్ –మ్యూజికల్ చైర్ పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ భాస్కర్‌రావు, జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, సెక్రటరీ దశరథరెడ్డి,తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

సాక్షి, యాదాద్రి : వివిధ పథకాలకు సంబంధించి ఆదేశించి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మండల పరిషత్, పంచాయతీ అధికారులతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్, ఉపాధిహామీ పథకం, నర్సరీ, ప్లాంటేషన్ సర్వైవల్, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్షించారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు షెడ్ నెట్‌ల ఏర్పాటు, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణకు నీరందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా ఉపాధిహామీ పథకంలో ఎక్కువ మందిని భాగస్వామ్యం చేసి గడువులోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించార. పనులను ఫొటో తీసి పంపాలని సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు., సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ప్రధానాలయ మాడ వీధుల్లో పొన్నవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది

పొన్నవాహనంపై నృసింహుడి విహారం

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామివారు మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రధానాలయంలో నిత్యారాధలు నిర్వహించిన అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామివారిని మురళీకృష్ణుడిగా తీర్చిదిద్ది ప్రత్యేక పల్లకిపై అధిష్ఠింపజేశారు. అనంతరం అలంకార సేవకు అర్చకులు హారతినిచ్చి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తరువాత భాజాభజంత్రీలు, సన్నాయి మేళాల మధ్య మురళీకృష్ణుడికి రాగాలాపన చేశారు. సాయంత్రం ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు పూర్తిచేసిన అనంతరం శ్రీస్వామి వారిని పొన్న వాహనసేవపై ఊరేగించారు. ఆచార్యులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం వేద మంత్రాలు, పారాయణాలు పఠిస్తుండగా శ్రీస్వామివారు పొన్నవాహనంపై విహరించారు. భక్తులు పొన్న వాహనసేవలో పాల్గొని పులకించారు. పొన్న వృక్షమును దేవ వృక్షముగా పురాణాలు పేర్కొంటున్నాయి. దీనికే కల్ప వృక్షమని అంటారని అర్చకులు తెలిపారు. ఈ వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గోవర్ధనగిరిధారి అలంకారం, రాత్రి సింహ వాహన సేవ ఉంటుంది.



మురళీకృష్ణుడి అలంకారంలో స్వామివారు..

‘ఉపాధి’లో 266 రకాల పనులు

2025-26 సంవత్సరానికి కార్యాచరణ

- 25,49,676 పని దినాలు
- రూ.32.40 కోట్ల బడ్జెట్
- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు



ఆలేరు రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనికల్పించేందేకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మొత్తం 266 రకాల పనులు చేపట్టడమే లక్ష్యంగా అంచనాలు రూపొందించారు. ఏప్రిల్ 1నుంచి కొత్తగా గుర్తించిన పనులను ప్రారంభించి 2026 మార్చి 31వ తేదీన పూర్తి చేయనున్నారు.

సీజన్‌కు అనుగుణంగా పనులు

గ్రామసభల్లో గుర్తించిన ఉపాధిహామీ పనులు సీజన్‌కు అనుగుణంగా ఉంటాయి. ఈసారి నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత, పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి శుభ్రం చేయడం, భూముల అభివృద్ధి, నీటి కుంటల నిర్మాణం ఎక్కువగా చేపట్టనున్నారు. అదే విధంగా పొలాల వద్దకు రోడ్ల అనుసంధానం, వ్యక్తిగత మరుగుదొడ్లు, హరితహారం మొక్కలకు కంచెలు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో ఉపాధిహామీ కూలీల వివరాలు

జిల్లాలోని 17 మండలాల్లో 428 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 1,43,205 కాగా యాక్టివ్ జాబ్ కార్డులు 93,848 ఉన్నాయి. కూలీలు 1,37,475 మంది ఉండగా 25,49,676 పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. దినసరి కూలి రూ.302 చెల్లించనున్నారు. మొత్తం రూ.32.40 కోట్ల బడ్జెట్ కేటాయించారు.

ఆత్మీయభరోసాతో పెరగనున్న కూలీలు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ద్వారా భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లిస్తుంది. దీంతో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్న లక్ష్యంతో అధికారులు కార్యాచరణ రూపొందించారు.

వంద రోజులు పని కల్పిస్తాం



2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులకు సంబంధించి కార్యాచరణ రూపొందించాం. పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వద్ద కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి పనుల్లో పాల్గొనే అవకాశం ఉంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. –నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

134 మంది కార్యదర్శులకు మెమోలు

నల్లగొండ: పంచాయతీ కార్యదర్శులకు సర్వీస్ బ్రేక్ తప్పేలా కనిపించడం లేదు. నల్లగొండ జిల్లాలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆ శాఖ జిల్లా అధికారి అనుమతి లేకుండా సెలవుపై వెళ్లడంతో 134 మందికి చార్జి మెమోలు అందజేశారు. గతంలోనూ 109 మందికి నోటీసులు జారీ చేశారు.

అనుమతి లేకుండా నెలల తరబడి

చార్జి మెమోలు అందుకున్న వారు ఎలాంటి అనుమతి లేకుండా సెలవుపై వెళ్లారు. వారంతా వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వెళ్లారు. తిరిగి విధుల్లో జాయిన్ అయ్యేందుకు రాగా 109 మంది కార్యదర్శుల సెలవుల సర్వీస్ కాలాన్ని కట్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి గతంలో పనిచేసిన ప్రాంతాల నుంచి బదిలీ చేశారు. దీంతో కార్యదర్శులంతా కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. వీరిని వాస్తవంగా సస్పెండ్ చేయాలి కానీ, మానవతా దృక్పథంతో సెలవు కాలానికి సంబంధించిన సర్వీస్‌ను రద్దు చేసి వేతనాన్ని కట్ చేసేలా ఉత్తర్వులు జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. తాజాగా చార్జి మెమోలు అందుకున్న వారిని త్వరలో విచారించేదుకు అధికారిని నియమించనున్నట్లు తెలిసింది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యారోగ్యశాఖ తనిఖీలు



మాదాపూర్‌లోని సాయిజ్యోతి ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలం, యాదగిరిగుట్ట పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని ఆర్‌కే ఆస్పత్రిలో సరైన సదుపాయాలు లేకపోవడం, ఆపరేషన్ థియేటర్ అపరిశుభ్రంగా ఉండడం, సిజేరియన్లు అధికంగా జరగడాన్ని అధికారులు గుర్తించారు. అదే విధంగా తుర్కపల్లిలోని నక్షత్ర ఆస్పత్రి, మాదాపూర్‌లోని శివసాయి, సాయిజ్యోతి క్లినిక్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ –2010 ప్రకారం నమోదు చేసుకున్న వైద్యులు కాకుండా ఎంబీబీఎస్ డాక్టర్లు సేవలందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పాటు యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీసాయి ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. ఎంబీబీఎస్ వైద్యుడికి బదులుగా అర్హతలేని వ్యక్తి సేవలు అందజేస్తున్నట్లు గుర్తించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ తెలిపారు.ఐదు ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్ల (అల్లోపతి, ఆయుష్) నిర్వాహకులకు ఈనెల 11వ తేదీన బ్లిష్‌మెంట్ యాక్ట్– 2010 పై అవగాహన కల్పించనున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.

భూ పంపిణీ చేయాలని ధర్నా

భువనగిరిటౌన్ : ఆలేరు మండలం కొలనుపాకలో సర్వే నంబర్‌లో 8లో గల రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. గ్రామంలో ఎంతోమది నిరుపేదలు ఉన్నారని, వారికి ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని ఎప్పటినుంచో అధికారులను కోరుతున్నా స్పందించడం లేదన్నారు. అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెక్క వెంకటేష్, కనకయ్య, పొన్నబోయిన రవి, గిరబోయిన సామి, పోతు ప్రవీణ్, మోతే భవాని పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసును వేడుకుంటున్న మహిళా రైతు

దండంపెడతా సారూ.. అమ్ముకోనియ్యండి!

భువనగిరిటౌన్ : మీకు దండం పెడుతా.. అమ్ముకోనియ్యండి.. బత్తాయిల వ్యాపారమే జీవనాధారం.. ఇబ్బందులకు గురి చేయకండి.. అని ఓ మహిళా రైతు ట్రాఫిక్ పోలీసులను వేడుకుంది. ఈ సంఘటన బుధవారం భువనగిరిలోని బాబుజగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. భువనగిరి, రామన్నపేట, వలిగొండతో పాటు వివిధ మండలాల రైతులు తాము పండించిన పండ్లు, బతాయిలు, నిమ్మకాయలను కొన్నేళ్లుగా బాబుజగ్జీవన్‌రాం చౌరస్తాలో విక్రయిస్తున్నారు. బుధవారం ట్రాఫిక్ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌జామ్ అవుతుందని, తొలగించాలని హెచ్చరించారు. ఈ క్రమంలో ఓ మహిళా రైతు కలగజేసుకుని బతుకుదెరువు దెబ్బతీయొద్దని ట్రాఫిక్ పోలీసును వేడుకుంది.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: మండలంలోని పగిడిపల్లి గ్రామ పరిధిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పగిడిపల్లి పరిధిలోని పాత కలెక్టరేట్ భవనం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గత వారం రోజులుగా మృతుడు భిక్షాటన చేస్తూ సంచరిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 8712662472, 8712662733 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మోత్కూరు: మానసికస్థితి సరిగ్గా లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోత్కూరు పట్టణ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మోత్కూరు పట్టణ పరిధిలోని అంగడి బజార్‌కు చెందిన బీసు లింగస్వామి(55) మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అతడికి మానసిక స్థితి సరిగ్గా ఉండటంలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం మోత్కూరు పట్టణ శివారులో మోదుగుచెట్టుకు కేబుల్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బీసు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

భర్తపై రోకలిబండతో భార్య దాడి

చౌటుప్పల్: భర్తపై భార్య రోకలిబండతో దాడి చేసింది. ఈ ఘటన బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన దుర్గం శ్రీనివాస్–సునీతలు దంపతుల మధ్య ఇటీవల గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 15రోజుల క్రితం కూడా భర్తతో గొడవ జరగడంతో సునీత చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెంలోని తన తల్లిగారింటికి వెళ్లింది. ఈ సమస్యపై మాట్లాడేందుకు గాను చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నివాసముంటున్న సునీత సోదరుడు వీరేశం ఇంటి వద్దకు రావాలని శ్రీనివాస్‌కు సూచించారు. ఈ క్రమంలో బుధవారం శ్రీనివాస్ చౌటుప్పల్‌కు వచ్చాడు. మాట్లాడుకునే క్రమంలో మాటామాట పెరగడంతో ఇంట్లో ఉన్న రోకలిబండతో సునీత తన భర్త శ్రీనివాస్‌పై దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాంపల్లి: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నాంపల్లి మండలం స్వాములవారి లింగోటం శివారులో జరిగింది. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన పూల రవి(33) మర్రిగూడ మండలం వట్టిపల్లిలో నిమ్మ తోట కౌలుకు తీసుకున్నాడు. బుధవారం రాత్రి తోటలో పని ముగించుకొని తన భార్యతో కలిసి బైక్‌పై నాంపల్లికి వస్తుండగా.. స్వాములవారి లింగోటం శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. రవి తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం మాల్‌కు తరలించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

కనగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి మీడియాతో మంత్రి మాట్లాడారు. కనగల్ పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేసే గ్లూకోమా సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన వారికి గడచిన 15 నెలల్లోనే రూ.1600 కోట్ల ఎల్‌ఓసీలను అందించామని, పేద ప్రజలు వైద్యం కోసం వస్తే 24 గంటలు ఎల్‌ఓసీలను అందజేస్తున్నామని అన్నారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రులకు ఎల్‌ఓసీ ఇచ్చే బదులుగా ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అన్నిరకాల సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. హైదరాబాదులో 4 టిమ్స్ హాస్పిటళ్లను ఆర్‌అండ్‌బీ ద్వారా నిర్మిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ ఎంజీఎంను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.2600 కోట్లతో హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, పాత భవనం అలాగే కొనసాగుతుందని తెలిపారు. వచ్చేవారం దేవరకొండ నియోజకవర్గంలో గ్లూకోమా కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. నల్లగొండ ఆస్పత్రిలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇతర ప్రాంతాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న 59 మంది డాక్టర్లను వెనక్కి పిలిపిస్తున్నామన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే వైద్య సేవలు అందిస్తామన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. పైలెట్ పద్ధతిన కనగల్ పీహెచ్‌సీలో గ్లూకోమా సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. కనగల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ గ్లూకోమా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక మోడల్ పీహెచ్‌సీని తీర్చిదిద్దుతామని తెలిపారు. తన ప్రసవం కూడా ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగిందని ఆమె పేర్కొన్నారు.

విత్తనాలు మార్చకుండా అవగాహన కల్పించాలి

- ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ మధుబాబు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుబాబు

త్రిపురారం: వరి విత్తనాలను ప్రతిసారి మార్చాల్సిన అవసరం లేదని, రైతులు తమ పొలంలోనే పండించిన వరి ధాన్యాన్ని విత్తనాలుగా వినియోగించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించాలని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్(ఈఈఐ) ప్రొఫెసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి, జిల్లా స్థాయి సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరంలో శాస్త్రవేత్తలు వ్యసాయంలో రైతులకు అందించిన సలహాలు సూచనలు, అదే విధంగా 2025–26వ సంవత్సరంలో అందించే సేవలపై శాస్త్రవేత్తలు సమీక్ష చేశారు. కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు గాను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్థిరమైన వరి ఉత్పత్తికి నేరుగా విత్తే పద్ధతి, ప్రకృతి వ్యవసాయం, బేకరీ ఉత్పత్తులు, వర్మీ కంపోస్ట్, కూరగాయల సాగు, కోళ్లు, గొర్రెల పెంపకం, వాటర్ మేనేజ్‌మెంట్, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ వంటి వాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. చీడపీడల నివారణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ మధుబాబు మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుకు అవసరమయ్యే వాటిపై నూతన ప్రయోగాలు చేయాలన్నారు. అనుభవం ఉన్న రైతుల ద్వారా సమాచారాన్ని సేకరించి ఇతర రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులు సాధించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ముందుండాలన్నారు. ఈ ఏడాది రైతులకు అందించాల్సిన సేవలపై ముందస్తుగా ప్రణాళిక ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం హెడ్ అనిల్, ఏడీఆర్ సుధాకర్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ, హాలియా ఏడీఏ రవీందర్, ఉద్యానవన అధికారి మురళి, పలువురు మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను ఎదుర్కోవడంపై అవగాహన


హాజరైన నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, పోలీసులు


అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

- సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. సైబర్ నేరాలపై నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సైబర్ స్టాకింగ్, వర్క్ ఫ్రం హోం పేరుతో మనల్ని ఆకర్షితులను చేస్తుంటారని, కొన్నిసార్లు భయభ్రాంతులకు గురిచేస్తూ మన నుంచి డబ్బులు కాజేస్తారని అన్నారు. సైబర్ క్రైంలో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే సైబర్ 1930కి నంబర్ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. సోషల్ మీడియా వాడకం సరైన పద్ధతిలో ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టుకోవద్దన్నారు. ఇంటర్నెట్ అనేది జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకపోవడం మంచిదని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలు, మోసాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి , నల్లగొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, రియాజ్, మోక్షిత్, ఫారూక్, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న పర్సు అప్పగింత

దేవరకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును డ్రైవర్, కండక్టర్ గుర్తించి తిరిగి అతడికి అప్పగించారు. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం హైదరాబాద్ నుంచి దేవరకొండకు వస్తుంది. ఈ బస్సులోని ప్రయాణికుడు ఒకరు పర్సు బస్సులోనే మర్చిపోయి కొండమల్లేపల్లిలో దిగిపోయాడు. బస్సులో పర్సును గుర్తించిన కండక్టర్ బుచ్చిరెడ్డి, డ్రైవర్ భోజ్యా దేవరకొండ డిపో అధికారులకు అందజేశారు. పర్సులోని వివరాల ఆధారంగా పర్సు పోగొట్టుకున్న ప్రయాణికుడిని గుర్తించి అతడికి తిరిగి పర్సు అప్పగించారు. ఆ పర్సులో రూ.14,500 నగదు ఉన్నట్లు తెలిపారు. నిజాయితీ చాటుకున్న బస్సు డ్రైవర్, కండక్టర్‌ను ఆర్టీసీ అధికారులు అభినందించారు.


ప్రయాణికుడికి పర్సు అప్పగిస్తున్న దేవరకొండ ఆర్టీసీ డిపో అధికారులు

అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి


సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో రైతులు పండించిన అన్నిరకాల పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్లు మల్లు నాగార్జునరెడ్డి, మండారి డేవిడ్ కుమార్, షేక్ నజీర్, నల్లడ మాధవరెడ్డి, నారాబోయిన వెంకట యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాత రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ అమలు చేసి రైతుభరోసా అందించాలని కోరారు. ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు అందించి నూతనకల్, మద్దిరాల, ఆత్మకూరు, చివ్వెంల, మోతె, పెన్ పహాడ్, మునగాల, నడిగూడెం మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరికుప్పల వెంకన్న, బొడ్డు శంకర్, దండ వెంకటరెడ్డి, మట్టిపల్లి సైదులు, ములకలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, పల్లె వెంకటరెడ్డి, కరీం, కందాల శంకర్ రెడ్డి, మేకల కనకారావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అర్ధగంటలో ఆచూకీ కనిపెట్టిన పోలీసులు


పోలీసులతో నాగజ్యోతి, ఆమె పిల్లలు

కనగల్: వైవాహిక జీవితంలో గొడవల కారణంగా మనస్తాపం చెంది తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన మహిళ ఆచూకీని అర్ధగంటలో కనగల్ పోలీసులు కనిపెట్టారు. నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామానికి చెందిన కాలం నాగజ్యోతి వైవాహిక జీవితంలో గొడవల కారణంగా జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లల్ని తీసుకొని ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. జ్యోతి భర్త, తల్లిదండ్రులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం సాయంత్రం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ విష్ణుమూర్తి పోలీసులను రెండు టీంలుగా విభజించి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నాగజ్యోతి అన్న మొబైల్‌కు కొత్త నంబర్ నుంచి నాగజ్యోతి ఫోన్ చేసి ×నేను చనిపోతున్నాను. నా గురించి ఎవరూ వెతకొద్దు, నేను పిల్లల్ని తీసుకొని చనిపోతున్నాను¥ అని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఈ విషయం ఆమె అన్న వెంటనే కనగల్ పోలీసులకు చెప్పడంతో ఆ నంబర్‌ను ట్రేస్ చేసి నాగజ్యోతి హైదరాబాద్‌లో ఉందని నిర్ధారించుకొని హయత్‌నగర్ పోలీసుల సహకారంతో నాగజ్యోతి ఆచూకీని అరగంటలో కనిపెట్టి ఆమెను క్షేమంగా వారి బంధువులకు హయత్‌నగర్‌లో అప్పగించారు. నాగజ్యోతి బంధువులు కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీపై రాజకీయ పోరాటం చేయాలి

- బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్రానికి ప్రమాదకరంగా మారబోతున్న బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విఫలమయ్యాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాయమాటలతో, మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలుపొందాలని బీజేపీ చూస్తోందని, దీనికి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని కాంగ్రెస్ పార్టీ అడ్డుకోలేక పోతోందని విమర్శించారు. భవిష్యత్తులో బీజేపీపై రాజకీయ యుద్ధం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజస్తాన్‌లో ఓ చిన్న కేసు విషంలో పోలీసులు అర్ధరాత్రి ఇంట్లో చొరబడి ఆరునెలల చిన్నారి చావుకు కారణం అయ్యారని, ముస్లిం వ్యతిరేకంగా పాలన చేయడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేడం లేదని విమర్శించారు. కేవలం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పైనే ఏదో గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 50శాతం రిజర్వేషన్ దాటవద్దని సుప్రీంకోర్టు చెపుతున్నా.. పార్లమెంట్‌లో బీసీ కులగణన ఆమోదం పొందదనే దృష్టితోనే బీసీ కులగణన చేసినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ నాటకమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం, నల్లగొండ జిల్లాల కార్యదర్శులు నూనె నాగేశ్వర్‌రావు, తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాశం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, ఎండీ సలీం, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, మల్లయ్య, అరుణ, పల్లా భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం


ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం జరిగిందని భావిస్తున్నామని, సొరంగమార్గం తవ్వేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని విమర్శించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వం తీరు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొరంగం పనులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

'పెద్దగట్టు' హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి(పెద్దగట్టు) ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. పెద్దగట్టు జాతర ఫిబ్రవరి 20వ తేదీన ముగియగా.. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 5 వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 13 రోజులకు గాను రూ.5.24 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. భాస్కర్, ఇన్‌స్పెక్టర్ బి. సుమతి, ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్యయాదవ్, ఈఓ కుశలయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో వింత జంతువు ప్రత్యక్షం


చెట్టుపై ఉన్న నల్లని జంతువు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో బుధవారం వింత జంతువు ప్రత్యక్షమైంది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసముంటున్న రఫీ ఇంట్లో మామిడి చెట్టుపై నల్లని వింత జంతువు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహారావు వచ్చి ఆ జంతువును పరిశీలించి దానిని సీవీఏట్ క్యాట్‌గా పిలుస్తారని చెప్పారు. ఇది మనుషులకు హాని చేయదని, అడవుల్లోనే రాత్రివేళ ఎక్కువగా సంచరిస్తుందని పేర్కొన్నారు.

200 టేకు చెట్లు దగ్ధం

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టేకు చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. రాయిపల్లి గ్రామానికి చెందిన జెట్ట శ్రీనివాస్ వ్యవసాయ భూమిలో సుమారు 350 టేకు చెట్ల ఉన్నాయి. ఈ టేకు చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 200 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మోత్కూరు నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. సుమారు రూ.2.50లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌లోని కార్వాన్‌కు చెందిన శ్రీవిశ్వాంజనేయ భక్త సమాజం, యాదగిరిగుట్టలోని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మహిళా భజన మండలి, వేల్పుపల్లి శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన మసన చెన్నప్ప ఆధ్వర్యంలో ఉపనిషత్ వైభవంపై ఉపన్యాసం చేశారు. హాలియాకు చెందిన చేబ్రోలు నారాయణదాసు సమక్షంలో సుభద్రా పరిణయం హరికథ గానం చేశారు. స్వరరాగ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో భక్తి సంగీతం, మెరుగు రాఘవేంద్రచే తబలా వాయిద్యం చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రముఖ జానపద, సినీ నేపథ్య గాయని తేలు విజయ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం కొనసాగింది. ఇక పలువులు కళాకారులు కూచిపూడి, భరత నాట్యం, సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.


ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్న సినీ నేపథ్య గాయని తేలు విజయ బృందం

ప్రశాంతత కోసం బుద్ధవనాన్ని సందర్శించాలి

- జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఆర్‌కే మిశ్రా


బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్‌కే మిశ్రా తదితరులు

నాగార్జునసాగర్: జీవితం ప్రశాంతంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ బుద్ధవనాన్ని సందర్శించాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఆర్‌కే మిశ్రా అన్నారు. నల్లగొండ జిల్లాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి వచ్చిన ఆయన బుధవారం నాగార్జునసాగర్ తీరంలోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధచరిత వనం, ధ్యానవనం, స్థూపవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంలోని అష్టబుద్ధుల వద్ద ధ్యానం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ డ్యాంను సందర్శించారు. ఆయనకు బుద్ధవనం చరిత్ర గురించి గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట డీఆర్‌డీఏ ఏపీడీ శేఖర్‌రెడ్డి, పెద్దవూర మండల తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆపద మిత్ర ప్రోగ్రాం శిక్షకులు తదితరులు ఉన్నారు.

'సిరిపురం' పర్సన్ ఇన్‌చార్జ్‌గా రామేశ్వరం


నియామక పత్రాలు అందుకుంటున్న సిరిపురం చేనేత సహకారం సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, పాలకవర్గ సభ్యులు

రామన్నపేట: మండలంలోని సిరిపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా అప్పం రామేశ్వరం, పాలకవర్గ సభ్యులకు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు బుధవారం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా చేనేత జౌళిశాఖ ఇన్‌చార్జ్ సహాయ సంచాలకురాలు పద్మ నియామక పత్రాలు అందజేశారు. సిరిపురం సొసైటీ ఉమ్మడి జిల్లాలోనే బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్ ఉత్పత్తిలో పేరుగాంచింది. జిల్లాలో పదవీకాలం ముగిసిన మిగతా సొసైటీల చైర్మన్లకు పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా, 2018లో కొంతమంది ఫిర్యాదు మేరకు సిరిపురం సొసైటీ బాధ్యతలను చేనేత జౌళిశాఖ డెవలప్‌మెంట్ అధికారికి అప్పగించారు. తాజా ఉత్తర్వుల మేరకు సిరిపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా అప్పం రామేశ్వరం మరియు పాలకవర్గ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తర్వులు అందుకున్న వారిలో పర్సన్ ఇన్‌ఛార్జ్ అప్పం రామేశ్వరం, ఉపాధ్యక్షురాలు రాపోలు లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శి జెల్ల లక్ష్మీనారాయణ, కోశాధికారి ఏలె నరసింహ, కార్యవర్గ సభ్యులు రాపోలు రమేష్, గుండు రాజు, రాపోలు పాపయ్య, సంగిశెట్టి వెంకటమ్మ, అప్పం శ్రీను, రాపోలు శ్రవణ్‌కుమార్ ఉన్నారు.